గుట్టలో లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం

యాదగిరిగుట్ట, మే 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సోమవారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రివేళ స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిపారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 24,46,033 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సంస్థాన్ నారాయణపురంలో దొంగ ఓటు కలకలం

- అధికారుల నిర్లక్ష్యంతో ఓటు వేయలేకపోయిన మహిళ

పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, మే13 : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో దొంగ ఓట్ కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన చిలువేరు శ్రావణి తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు వందో నంబర్ పోలింగ్ బూత్‌కు వెళ్లగా ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు శ్రావణికి తెలిపారు. తాను ఓటు వేసేందుకు ఇప్పుడే వచ్చానని అధికారులకు తెలిపింది. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకుంటామని సాయంత్రం 4 గంటల తరువాత రమ్మని అధికారులు చెప్పి పంపించారు. దాంతో శ్రావణి సాయంత్రం పోలింగ్ బూత్‌కు వెళ్లగా చిలువేరు శ్రావణి పేరు మీద ఇద్దరు ఉన్నారని, ఇద్దరు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. అసలు తాను ఓటు వేయలేదని, ఎవరో దొంగ ఓటు వేశారని శ్రావణి ఎన్నికల అధికారులతో వాగ్వాదం చేసింది. పొరపాటు జరిగిందని అధికారులు శ్రావణికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. శ్రావణి ఎంతకూ వినకపోవడంతో ఎన్నికల అధికారులు చివరికి టెండర్ ఓట్ వేసి పంపించారు. అధికారులు నిర్లక్ష్యంతోనే శ్రావణి ఓటు హక్కు కోల్పోయిందని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో కాసేపు గొడవ జరిగింది.

లారీల కొరత.. తడుస్తున్న ధాన్యం

కనుముక్కుల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

- ఇబ్బంది పడుతున్న రైతులు
- కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్

భూదాన్‌పోచంపల్లి, మే 13 : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కుల గ్రామంలో నాలుగు రోజులు క్రితం కాంటా వేసిన ధాన్యం రవాణా చేయకపోవడంతో 2,800 ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినా కొనుగోలు చేయకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. మిల్లర్ల నిర్లక్ష్యం, లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లారీలు ధాన్యాన్ని రవాణా చేయకపోవడంతో వర్షానికి తడిసిపోతున్నాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేపడుతున్నారు. సర్కారు నిర్లక్ష్యంతో రైతన్న నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని ఏ-గ్రేడ్‌గా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాం కొనుగోలును వేగవంతం చేయాలని వేడుకుంటున్నారు.

కొనుగోళ్లలో అలసత్వం..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు రోజుల క్రితం కాంటా వేసిన ధాన్యాన్ని లారీల కొరతతో మిల్లులకు తరలించలేదు. దాంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం మొత్తం తడిసింది. అధికారులు రవాణా సౌకర్యం కల్పించి కొనుగోళ్లలో వేగం పెంచాలి.

- రామిరెడ్డి, రైతు, కనుముక్కుల

40 రోజులుగా పడిగాపులు..

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 40 రోజులైంది. కొన్న ధాన్యం మిల్లుకు తీసుకపోతలేరు. మా ధాన్యం కొంటలేరు. ఎప్పుడు కొంటరోనని ఎదురు చూస్తున్నాం. కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నాం. మా వడ్లు కొంటేనే ఓటు వేస్తాం. లేదంటే బహిష్కరిస్తాం. నాయకులకు చెప్పినా మా సమస్యలు పట్టించుకోవట్లేదు.

-కొత్త లింగస్వామి, కనుముక్కుల

ఓటమి భయంతో కాంగ్రెస్, బీజేపీ నీచ రాజకీయాలకు ఒడిగట్టాయి

- సీపీఎం అభ్యర్థి జహంగీర్

రామన్నపేట, మే 13 : ఓటమి భయంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి, భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ఆరోపించారు. సోమవారం ఎన్నికల సరళిని పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు పటించుకున్న పాపాన పోలేదన్నారు. ఓటమి భయంతో రెండు పార్టీల అభ్యర్థులు కేవలం డబ్బు రాజకీయాలను నమ్ముకుని ఎన్నికల నిబంధనలను ఉల్లఘించారన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య, గడ్డం వెంకటేశ్, పట్టణ కార్యదర్శి గాదె నరేందర్, నాయకులు గొరిగె సోములు, కందుల హన్మంతు, బావండ్లపల్లి బాలరాజు, మునుకుంట్ల లెనిన్, రమేశ్, వెంకన్న, పిట్టల శ్రీను, గంజి అశోక్, మల్లేశం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రామన్నపేట, మే 13 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి సర్నేనిగూడెం శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన వరికుప్పల నాగేశ్(23) సర్నేనిగూడెంలోని బంధువుల ఇంటికి బొడ్రాయి పండుగ కోసం వెళ్లాడు. ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామం తిరిగి వస్తుండగా ప్రాథమిక పాఠశాల వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సని మిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి మామ రూపాని వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, మే 13 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రారంభంలో కొంత మందకొడిగా సాగినా 10 గంటల వరకు పుంజుకున్నది. యువత, మహిళలు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు వెల్లడించారు. వైద్య సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో వైద్య సదుపాయాలు కల్పించారు. భువనగిరి మండలం వడపర్తిలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకోగా, అనంతరాం, బొమ్మాపల్లిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి ఓటు వేశారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆత్మకూర్(ఎం)మండలంలో 81శాతం పోలింగ్ నమోదైనట్లు ఎంపీడీఓ నిరంజన్‌వలీ తెలిపారు. 27,928 ఓట్లలో 22,661 ఓట్లు పోలైనట్లు చెప్పారు. పురుషులు 11,639, మహిళలు 11,022 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పారుపల్లిలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ దంపతులు, కూరెళ్లలో డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సైదాపురంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మల్లాపురంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఓటు వేశారు. మోటకొండూరు మండలం చందేపల్లిలో ఏర్పాటు చేసిన 235/97 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు ఓటింగ్ నిలిచిపోయింది. ఓ వ్యక్తి ఓటు వేసే క్రమంలో ఈవీఎం బటన్ గట్టిగా నొక్కడంతో స్ట్రక్ అయ్యింది. ఎన్నికల సిబ్బంది అప్రమత్తమై ఓటింగ్ ప్రక్రియను నిలిపివేసి సాంకేతిక లోపాన్ని సరిచేశారు. అనంతరం పోలింగ్ ప్రక్రియ యథావిధిగా కొనసాగింది. భువనగిరి మండలం నమాత్‌పల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు అతికం రుక్కమ్మ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. వలిగొండ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంతో పాటు మండలంలోని టేకులసోమారం పోలింగ్ కేంద్రాన్ని రాచకొండ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. రాజాపేట మండలం పారుపల్లిలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని సింగారంలో 86వ పోలింగ్ బూత్‌లో 2:50 నుంచి 3:30 వరకు పోలింగ్ నిలిచిపోయింది. ఆ తర్వాత యథావిధిగా కొనసాగింది. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం 26 పోలింగ్ బూత్‌లో 36 మంది ఓటు వినియోగించుకున్న తర్వాత ఈవీఎం మొరాయించింది. దాంతో 45 నిమిషాలపాటు పోలింగ్ ఆగింది. అనంతరం మరో ఈవీఎం ఏర్పాటు చేశారు. మండలంలోని తంగడపల్లి, తూప్రాన్‌పేట, దండుమల్కాపురంలో పోలింగ్ కేంద్రాలను రాచకొండ సీపీ తరుణ్‌జోసి సందర్శించారు. అడ్డగూడూరు మండలం ధర్మారంలో ఎమ్మెల్యే మందుల సామేల్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భువనగిరి మండలం గౌస్‌నగర్‌లో ఈవీఎం మోరాయించింది. అంతేకాకుండా రాత్రి కురిసిన అకాల వర్షానికి పలు పోలింగ్ కేంద్రాల ఆవరణలు చిత్తడిగా మారడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. చందుపట్లలో పోలింగ్ పక్రియను సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షత్రియుమ్, పట్టణ పరిధిలోని రాయగిరి పోలింగ్‌స్టేషన్‌ను రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి పరిశీలించారు. మోత్కూరు మండలంలో 27,074 మంది ఓటర్లకు గానూ 20,339 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు 75.12 శాతం ఓటింగ్ నమోదైంది. మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గాంధీనగర్, అంగడిబజార్, కొండగడపతోపాటు పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి దత్తప్పగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం దంపతులు తమ ఓటుహక్కును పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినియోగించుకున్నారు. అనాజిపురం, పొడిచేడు, పాలడుగు, మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని ఒకటి, రెండో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. చౌటుప్పల్ మండలంలో 85.72 శాతం పోలింగ్ నమోదైంది. 64,213 మంది ఓటర్లకు గానూ 55,042 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీపరిధిలోని లింగోజిగూడెంలో కాసేపు ఈవీఎం మొరాయించింది. గుండాల మండల వ్యాప్తంగా 25,656 ఓటర్లలో 20,122 మంది ఓటర్లు ఓటును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 78.43 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. బీబీనగర్ మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి రహీంఖాన్‌గూడెంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. భూదాన్‌పోచంపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

రామన్నపేట మండలంలో 78.14 శాతం పోలింగ్ నమోదైంది. సీపీఎం అభ్యర్థి మునిపంపులలో, హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ తన స్వగ్రామం బోగారంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సిరిపురం, వెల్లంకి గ్రామాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

రామన్నపేట : బోగారం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ దంపతులు

యాదగిరిగుట్ట : సైదాపురంలో ఓటు హక్కును వినియోగించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు

భువనగిరి కలెక్టరేట్ : వడపర్తిలో ఓటు వేసిన జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

అడ్డగూడూరు మండలం ధర్మారంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ దంపతులు

భువనగిరి కలెక్టరేట్ : అనంతారంలో ఓటు వేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్ : బొమ్మాయిపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి

ఆత్మకూరు(ఎం) పారుపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ దంపతులు



సంస్థాన్ నారాయణపురంలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

సంస్థాన్‌నారాయణపురం : లింగవారిగూడెంలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల దంపతులు

రాజాపేట : పారుపల్లిలో ఓటు వేసిన మోత్కుపల్లి

బీబీనగర్ : రహీంఖాన్‌గూడెంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న యాదగిరిగుట్ట ఈఓ భాస్కర్‌రావు ఫ్యామిలీ

ఆత్మకూర్(ఎం) : కూరెళ్లలో ఓటు వేసిన డీఎల్‌డీఏ చైర్మన్ పిచ్చిరెడ్డి దంపతులు

తుర్కపల్లి : మాదాపురంలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు

రాజాపేట మండలం రఘునాథపురంలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

భువనగిరి కలెక్టరేట్ : ఓటు హక్కు వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు రుక్కమ్మ

భువనగిరిలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

తూప్రాన్‌పేట పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన రాచకొండ సీపీ తరుణ్‌జోషి

పోచంపల్లి పోలింగ్ కేంద్రం వద్ద నిలిచిన వర్షపు నీటిపై మట్టి పోస్తున్న మున్సిపల్ సిబ్బంది

మోత్కూరులో సిరా గుర్తు చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

గుండాలలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ ఓటర్లు

భూదాన్‌పోచంపల్లి : ఓటు కోసం బారులుదీరిన ఓటర్లు

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

ఆత్మకూరు(ఎం) పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు